736) రామక్రియ

ప॥ ఇచ్చలో గోరేవల్లా ఇచ్చేధనము । అచ్యుతనామమెపో అధికపుధనము ॥

చ॥ నారదాదులువొగడేనాలుకపయిధనము । సారపువేదములలో చాటేధనము ।
కూరిమిమునులు దాచుకొన్నట్టిధనము । నారాయణనామ మిదే నమ్మినట్టిధనము ॥

చ॥ పరమపదవికి సంబళమైనధనము । యిరవై భక్తులకెల్లా నింటిధనము ।
పరగ నంతరంగాన పాతినట్టిధనము । హరినామ మిదియపో అరచేతిధనము ॥

చ॥ పొంచి శివుడు కాశిలో బోధించేధనము । ముంచినఆచార్యుల మూలధనము ।
పంచి శ్రీవేంకటపతి పాలించేధనము । నించి విష్ణునామ మదే నిత్యమైనధనము ॥